క్లుప్తంగా

నేడు బహిరంగ వేలం

రాజోళి: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వదశాల, తైబజారు వేలానికి సంబంధించి బహిరంగ వేలం మంగళవారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సెక్రటరీ కృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు నిర్ణీత రుసుం చెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు. వేలం అనంతరం నిర్ణయించిన సొమ్మును కూడా డిపాజిట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

23 నుంచి ఉషేన్ సాహెబ్ తాత ఉర్సు

శాంతినగర్: తనగలలో వెలసిన ఉషేన్ సాహెబ్ తాత ఉర్సు ఈనెల 23 నుంచి నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న గంధం, 24న ఉర్సు, 25న కిస్తీ వేడుకలు జరుపనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమాలు, వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర పౌరాణిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భక్తులు, శిష్యులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలు విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత



ధరూరు: వివిధ సందర్భాల్లో మొబైల్‌పోగొట్టుకున్న నలుగురు బాధితులకు వారి ఫిర్యాదు మేరకు ట్రేస్ చేసి అందజేసినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. సీఈఐఆర్ వెబ్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి సోమవారం స్టేషన్‌లో అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. దొంగలు, సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ముగ్గురికి గాయాలు

రాజోళి: మండల కేంద్రంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడిన ఘటన సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. పడమటి గార్లపాడుకు చెందిన నాగరాజు భార్యతోపాటు బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా కొత్తకోటకు చెందిన వ్యక్తి బైక్‌పై తుమ్మిళ్లకు వచ్చి వెళ్తుండగా మండల కేంద్ర శివారులో ఎదురెదురుగా బైక్‌లు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ప్రమాదంలో భార్యాభర్తలకు స్వల్ప గాయాలు కాగా, కొత్తకోటకు చెందిన వ్యక్తికి తలకు గాయమైంది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలోని మొక్కజొన్న పొలంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. సోమవారం కర్నూల్‌కు చెందిన సుధాకర్, షేక్ అబ్దుల్లా, కిరణ్ కుమార్, శివ ప్రసాద్, సురేష్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద 5 సెల్‌ఫోన్లు, రూ.60,180 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కంటైనర్ బోల్తా.. తప్పిన ప్రమాదం



ఎర్రవల్లి: జాతీయ రహదారిపై కంటైనర్ లారీ బోల్తాపడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. హర్యానాకు చెందిన కంటైనర్ లారీ హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు వెళ్తున్న క్రమంలో జాతీయ రహదారిపై ఎర్రవల్లి కూడలి సమీపంలో డ్రైవర్ అజాగ్రత్త కారణంగా ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

కాడెద్దుల అపహరణ

ఎర్రవల్లి: రెండు కాడెద్దులు అపహరణకు గురైన సంఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మురళి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని సాసనూలు గ్రామానికి చెందిన బోయ మద్దిలేటి, బోయ లక్ష్మీనాయుడుకు చెందిన కాడెద్దులను గ్రామ సమీపంలోని తమ కళ్లందొడ్డిలో ఉంచి ఆదివారం రాత్రి ఇళ్లకు వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూడగా ఇరువురి ఎద్దుల జతల్లో ఒక్కొక్క ఎద్దు అపహరణకు గురైందని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఒక్కో ఎద్దు విలువ సుమారు రూ.60వేల వరకు ఉంటుందని బాధితులు పేర్కొన్నారు.

బెబ్బర్ల సాగు.. లాభాలు బాగు

- పంట సాగుపై ఆసక్తి చూపుతున్న అన్నదాతలు
- నీటి లభ్యత తక్కువ ఉన్న రైతుల ఆసక్తి
- ఎకరాకు ఆరు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి



మన్నాపురం శివారులో గుడ్డెందొడ్డి దారిలో సాగు చేస్తున్న బెబ్బర్ల పంట

ధరూరు: నడిగడ్డ ప్రాంతంలో బెబ్బర్ల(అలసందలు) సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న పొలాల్లో మంచి దిగుబడులు, లాభాలు వస్తుండడం.. తక్కువ కాలంలోనే పంట సాగు పూర్తి కావడం వంటి పరిణామాల నేపథ్యంలో సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

సీడ్ పత్తి మాదిరిగానే..

ఈ ప్రాంతంలో నాలుగు దశాబ్దాలుగా సాగవుతున్న సీడ్ పత్తి మాదిరిగానే బొబ్బెర్ల సాగుకు అగ్రిమెంట్లు ఇస్తున్నారు. కర్నూలు ప్రాంతానికి చెందిన ఆర్గనైజర్లు ఈ ప్రాంతానికి చెందిన సబ్ ఆర్గనైజర్ల ద్వారా రైతులకు విత్తనాలు ఇస్తుండంతో రైతులు బొబ్బెర్ల సాగును ముమ్మరం చేశారు. మండలంలోని 28 పంచాయతీల్లోని ప్రతి గ్రామంలో రైతులు దాదాపు 150 హెక్టార్లలో సాగు చేస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు.

లాభదాయకంగా సాగు..

ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుండటం, ముందుగానే కంపెనీల ప్రతినిధులు నిర్ణయించిన ధర రూ.4,500 నుంచి రూ. 8000 వరకు కొనుగోలు చేస్తున్నారు. 90 రోజుల్లోనే పంట కాలం పూర్తవడం తడులు కూడా తక్కువగా ఆశిస్తుండటంతో రైతులు పంట సాగు చేస్తున్నారు. మండలంలో ఈఎస్‌ఆర్ రకం విత్తనాలు నేలలకు అనుకూలంగా ఉండంతో వాటినే రైతులకు ఇస్తున్నారు. మంచి దిగుబడి ఇస్తుండడంతో రైతులు సాగు విస్తీర్ణాన్ని పెంచారు.

పెట్టుబడి ఖర్చులు తక్కువే..

పంట సాగు చేసి నాటి నుంచి పంట కాలం పూర్తయ్యే వరకు పెట్టుబడి కూడా తక్కువగానే ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కోత ఖర్చులు మాత్రమే రైతులు భరిస్తుండగా.. పొలం వద్ద నుంచి తీసుకెళ్లే క్రమంలో హమాలీ, రవాణా చార్జీలు మొత్తం కంపెనీలే భరిస్తున్నాయి. పొలాల వద్దే తూకం వేసి బెబ్బర్లను తీసుకెళ్తున్నారు. ఎకరాలకు అన్ని ఖర్చులు పోనూ రూ. 25వేల నుంచి 30 వేలు లాభాలు వస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు.

రెండేళ్లుగా సాగు



నాకున్న రెండెకరాల్లో బెబ్బర్ల పంటను గత మూడేళ్ల సాగు చేస్తున్నాం. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి కొంత దిగుబడి తగ్గింది. అయినా ఇతర పంటలతో పోలిస్తే లాభదాయంగా ఉంది.

\- వీరేష్ రైతు, ధరూరు

ఎలాంటి ఒత్తిడికి లోనుకావొద్దు



అమరవాయిలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



ధరూరు కేజీబీవీలో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: పదో తరగతి పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకావొద్దని ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి డీసీసీబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డితో పాటు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు విద్యనందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి

మల్దకల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలని ప్రధానోపాధ్యాయుడు నరేష్ సూచించారు. సోమవారం మండలంలోని అమరవాయి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ నాయకులు మురళీధర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలి



బల్గెరలో కూలీలతో మాట్లాడుతున్న రాజు

గట్టు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను అన్ని గ్రామాల్లో ప్రారంభించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు కోరారు. సోమవారం ఆరగిద్ద, గొర్లఖాన్‌దొడ్డి, బల్గెర గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పర్యటించారు. గ్రామ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. వ్యవసాయ పనులు ముగింపు దశకు చేరుకున్నాయని, ఉపాధి పనులను అన్ని గ్రామాల్లో ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గంగిమాన్‌దొడ్డి, తారాపురం గ్రామాల్లో ఉపాధి పనులు ఇప్పటికీ ప్రారంభించలేదన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి ఉపాధి పనులపై అవగాహన కల్పించి, జాబ్ కార్డులు ఉన్న కూలీలందరూ ఉపాధి పనుల్లో పాల్గొనే విధంగా అవగాహన కల్పించాలన్నారు. బల్గెరలో వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడిగా భీమన్న, కార్యదర్శిగా రాంఖుషి, కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది



చెక్కు అందజేస్తున్న హనుమంతునాయుడు

ధరూరు: కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతు నాయుడు అన్నారు. సోమవారం మండల పరిధిలోని జాంపల్లి గ్రామంలో ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందిన జంపిరెడ్డి(జంపన్న) కుటుంబ సభ్యులకు రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేశారు. పార్టీలో పని చేసే ప్రతి ఒక్క కార్యకర్త సభ్యత్వం కలిగి ఉంటే ఇలాంటి ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కార్యకర్తలు మోనేష్, నూర్ పాష, శేఖర్‌నాయుడు, శ్రీరాములు, వెంకటేష్ నాయుడు, అబ్రహం, తిరుమలేష్, ముని తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



ధరూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు



గట్టులో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

గట్టు/ధరూరు/మానవపాడు: గట్టులో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన పరీక్షలకు 277 మంది విద్యార్థులకు గాను 271 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కేఎస్‌డీ రాజు, డిపార్టుమెంటల్ అధికారి కాశీవిశ్వనాథ్‌లు తెలిపారు.

★ ధరూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాతంగా జరుగుతున్నాయి. 356 మంది విద్యార్థులకు గాను 6 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూరింటెండెంట్ సత్యనారాయణ, డిపార్ట్‌మెంటల్ అధికారి శేఖర్ తెలిపారు.

★ మానవపాడు మండల కేంద్రంలోని శ్రీగంగు వెంకటకృష్ణరెడ్డి ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ పరీక్షకు 182మంది హాజరైనట్లు సూపరింటెండెంట్ వెంకటకృష్ణరెడ్డి తెలిపారు.

బంగారు లక్ష్మణ్‌కు ఘన నివాళి

గద్వాలటౌన్: బీజేపీ మాజీ జాతీయ అధ్యక్షుడు దివంగత బంగారు లక్ష్మణ్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జగ్జీవన్‌రాం విగ్రహం ఎదుట వద్ద ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టారు. అంధుల పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అప్సర్‌పాష, అయ్యపురెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చందు, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందిపై చర్య తీసుకోవాలి

గద్వాల క్రైం: హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా సోమవారం మున్సిపల్ దుకాణం తెరచిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితురాలు పట్టణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన రమాదేవి కూరగాయాల మార్కెట్ సమీపంలోని మున్సిపల్ దుకాణ సముదాయంలో షాప్ నంబర్ 7ను దక్కించుకున్నారు. అయితే పలు సంఘటనల నేపథ్యంలో బాధితురాలు 2023లో హైకోర్టును ఆశ్రయించి న్యాయం చేయాల్సిందిగా కేసు వేశారు. దీంతో హైకోర్టు తీర్పు వచ్చే వరకు మున్సిపల్ దుకాణం తెరవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు రమాదేవి తెలిపారు. ఈ క్రమంలో మున్సిపల్ సిబ్బంది సోమవారం ఉదయం హైకోర్టు అదేశాలను పట్టించుకోకుండా షాప్ తెరవడం జరిగిందని ఇట్టి సంఘటనపై చర్యలు తీసుకోవల్సిందిగా స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం చేయాలి

అయిజ: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ తాహేర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. యువత స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఉద్యోగానికి ఎంపిక

గద్వాలటౌన్: ప్రభుత్వ హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఉద్యోగానికి గద్వాలకు చెందిన అభ్యర్థి మన్నె సాయి సౌజన్య ఎంపికైంది. సోమవారం వెలువడిన ఫలితాల్లో సాయి సౌజన్య రాష్ట్ర స్థాయిలో 108వ ర్యాంకుకు కాగా, జోనల్ స్థాయిలో 17వ ర్యాంకు, మహిళా విభాగంలో 3వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా సౌజన్య సంతోషం వ్యక్తం చేశారు. పలువురు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

నిరుపేద ముస్లింలకు సాయం

అలంపూర్ రూరల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని అలంపూర్ పట్టణంలోని నిరుపేద ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆసీఫ్‌ఖాన్ దుస్తులు అందజేశారు. 500 చీరలు, 100 షర్ట్ పీసులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పరుషరాం, రఘుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల సందర్శన



మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం పోలీస్‌స్టేషన్, పోస్టాఫీస్ కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రకాంత్ పౌరులకు అందిస్తున్న సేవలు, వివిధ రకాల కేసులు పరిష్కారాలపై విద్యార్థులకు వివరించారు. పోస్ట్‌మాస్టర్ రాఘవేంద్రరెడ్డి పోస్ట్‌ఫీస్ ద్వారా జరిగే ఉత్తర, ప్రత్యుత్తరాల విధానాలు, సుకన్య సమృద్ధియోజన, నగదు లావాదేవిలు మొదలగు సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో మురళీధర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగాన్ని రక్షించుకుందాం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

అలంపూర్: రవాణా రంగాన్ని రక్షించుకుందామని తెలంగాణ పబ్లిక్ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. అలంపూర్ చౌరస్తాలో చలో పార్లమెంట్ కరపత్రాలను సోమవారం ఆటో డ్రైవర్లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2019లో మోటార్ వాహనాల చట్టానికి చేసిన సవరణలతో రవాణ రంగం ఉనికికే ప్రమాదం నెలకొందన్నారు. రవాణా రంగ కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధమైన సామాజిక సంక్షేమ చట్టాలు లేవన్నారు. ప్రస్తుతం రవాణా రంగ కార్మికులపై దాడులు పెరిగాయన్నారు. రవాణా కార్మికులు రేయిబంవళ్లు కష్టపడిన కుటుంబ పోషణ కష్టమైందన్నారు. రవాణ శాఖలో పెరిగిన జరిమానాలు తగ్గింపునకు, ఆత్మగౌరవంతో విధుల నిర్వాహణకు పరిస్థితులు కల్పించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేసిన పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రవాణా రంగ కార్మికులపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 24న చలో పార్లమెంట్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. చలో పార్లమెంట్‌కు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు నరసింహ్మా, మహేష్, మద్దిలేటి, రమేష్, స్వాములు, మద్దన్న, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిలో వెనుకబాటుకు గురవుతుంది'



మాట్లాడుతున్న పోరాట సమితి సభ్యులు

గద్వాల: కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న వర్గపోరు, స్థానిక ఎమ్మెల్యే అసమర్థత కారణంగా నడిగడ్డ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబాటుకు గురవుతుందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రధానంగా గద్వాల నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఓ పక్క ప్రాజెక్టుల కింద రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండిపోతుంటే పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా నెట్టెంపాడు ప్రాజెక్టులో ర్యాలంపాడు జలాశయం గత ఐదేళ్లుగా రిపేర్లు చేయకుండా తాత్సారం చేస్తున్నట్లు, 99,104 ప్యాకేజీ పనులు అసంపూర్తిగా కొనసాగుతున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నడిగడ్డ హక్కుల పరిరక్షణ సమితి నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, బలరాంనాయుడు విష్ణు, ప్రేమ్‌రాజ్, మునెప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వర్తించేలా చూడాలి



శాంతినగర్‌లో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అర్చకులు

శాంతినగర్: దేవాలయాల్లో పూజలు నిర్వహించే అర్చకులకు ప్రభుత్వ పథకాలు వర్తించేలా చూడాలని కోరుతూ ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌కు అర్చకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఏఐసీసీ కార్యదర్శిని కలిసిన అర్చకులు ముందుగా శాలువా, పూలమాలతో సత్కరించి వారి సమస్యలు వివరించారు. ఇందిరమ్మ ఇళ్లు, గోశాల నిర్మాణం, దేవాలయాల నిర్మాణానికి స్థలం, ప్రభుత్వం ద్వారా అందే ప్రతి పథకం అర్చకులకు వర్తింపజేసేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గద్వాల జిల్లా ధూప, దీప నైవేద్య సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి ఆచార్యులు, అశోక్‌కుమార్, అడవిస్వామి, తిరుమలేష్, బసవరావు, ఆయా మండలాలకు చెందిన అర్చకులు పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటుకు సహకరించాలి

రాజోళి: మండల కేంద్రంలో కళాశాల ఏర్పాటుకు సహకారం అందించాలని కాలేజీ సాధన సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం శాంతిగనర్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. మండలంలో జూనియర్ కళాశాల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సమస్యను ముఖ్యమంత్రికి విన్నవించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల సాధన సమితి కన్వీనర్ ఈశ్వరయ్య, తుకారాం, జయన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన



విద్యార్థులతో ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మండల విద్యాధికారి రవీంద్రబాబు పరిశీలించారు. సోమవారం మండల పరిధిలోని పారుచర్ల ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వండాలని సూచించారు. అపార్ నంబర్‌కు నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



గద్వాలలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు



అలంపూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

సాక్షి నెట్‌వర్క్: ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని జిల్లా పరిధిలోని పలు తహసీల్దార్ కార్యాలయాల వద్ద సోమవారం వారు నిరసనలు తెలిపి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, పదోన్నతి, బీమా సౌకర్యం తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

★ మానవపాడు రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలు నిరసన తెలిపి తహసీల్దార్ జోషి శ్రీనివాస శర్మ, డాక్టర్ సింధులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

★ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ ఆధ్వర్యంలో ధరూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆశా కార్యకర్తలు తహసీల్దార్ విజయభూపాల్ రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. అదే విధంగా బుధవారం చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

★ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు నరసింహ్మ ఆధ్వర్యంలో అలంపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు చిట్టెమ్మ, శివలింగమ్మ, శ్యామల, జయమ్మ, మంజుల, నాగలక్ష్మమ్మ, మమత తదితరులు పాల్గొన్నారు.

★ ఉండవెల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రభాకర్‌కు ఆశా కార్యాకర్తలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశాలు అములమ్మ, మదనమ్మ, వెంకటేశ్వరమ్మ, చిన్నమ్మ, వెంకటమ్మ, భాగ్యలక్ష్మి, నాగమ్మ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

★ సీపీఎం నాయకులు విజయ్‌కుమార్, యూటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు తిప్పన్న , సీఐటీయూ ఆధ్వర్యంలో రాజోళి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించి తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు లక్ష్మన్న, సుజాత, అనితమ్మ తదితరులు పాల్గొన్నారు.

★ సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ ఆధ్వర్యంలో గట్టు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా కార్యకర్తలు ఆందోళన నిర్వహించి తహసీల్దార్ సలీముద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సరస్వతి, శశికళ, సుజాత, శ్రీదేవి, గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

★ అయిజ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

★ ఆశా వర్కర్ల హామీలు నెరవేర్చాలి గట్టు తహసీల్దార్ వీరభద్రప్ప వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశాలు సరస్వతమ్మ, సుజాత, రాధ, సుమలత, వెంకటేశ్వరి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

★ గద్వాల తహసీల్దార్ కార్యాయలం వద్ద ఆశా కార్యకర్తలు కలిసి ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మల్లికార్జున్‌కు అందజేశారు. కార్యకరమంలో ఆశావర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మమ్మ, సునీత, నర్సింగమ్మ, లక్ష్మి, నాగప్రమీల, రమాబాయ్, జయలక్ష్మి, శ్వేత, శ్రీదేవి, అబేదా తదితరులు పాల్గొన్నారు.